క్లుప్తంగా

కల్యాణం.. కమనీయం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పండితులు

పుత్తూరు రూరల్ : స్థానిక గేటువీధిలోని పట్టాభిరామాలయంలో శుక్రవారం సీతారాముల వారి కల్యాణం వైభవంగా జరిగింది. తెల్లవారు జామున స్వామి అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

సారా ఊట ధ్వంసం.. మహిళ అరెస్టు



సారా ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

కార్వేటినగరం: పాలసముద్రం మండలం నరసింహాపురం గ్రామంలో 400 లీటర్ల సారా ఊట ధ్వంసం చేసి మహిళను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ నాగరాజు తెలిపారు. గ్రామానికి చెందిన వీరస్ భార్య అల్లి సారా వ్యాపారం చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పాలసముద్రం ఎస్ఐ సురేష్, కార్వేటినగరం ఎక్సైజ్ ఎస్ఐ జయశంకర్ దాడులు నిర్వహించారు. నరసింహాపురం వద్ద సారా తయారీకి సిద్ధం చేసిన బెల్లం ఊటను ధ్వంసం చేసి నిందితురాలిని శుక్రవారం అరెస్టు చేశారు. రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఓం శక్తి అమ్మవారికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి పొంగళ్లు తీసుకొస్తున్న భక్తులు

పాలసముద్రం: మండలంలోని నిశ్శింకాపురం గ్రామంలో వెలసిన ఓం శక్తి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం వివిధ అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం ప్రతి ఇంటి నుంచి ఓంశక్తి భక్తులు పంబవాయిద్యాలతో పొంగళ్లు తీసుకొచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

మంత్రి రోజాకు కృతజ్ఞతలు



మంత్రికి జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్సీ

వడమాలపేట: మంత్రి రోజాను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం పూడి గ్రామంలో కలిశారు. తన గెలుపునకు కృషి చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. శాలువా, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. డీసీసీబీ బ్యాంక్ డైరెక్టర్ కరుణాకర్‌చౌదరి, రాష్ట్ర బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రేణుక, సర్పంచ్ కుసుమ, నాయకులు యాదవేంద్రారెడ్డి, చంద్రారెడ్డి, రామిరెడ్డి ఉన్నారు.

ఆస్పత్రి ప్రారంభం

పుత్తూరు రూరల్: స్థానిక కాపువీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రైవేటు ఆస్పత్రిని శుక్రవారం పర్యాటకశాఖ మంత్రి ఆర్కే రోజా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి సూచించారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



రాహుకేతు పూజలు చేయించుకుంటున్న అల్లరి నరేష్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో తెలుగు సినీ హీరోలు గోపీచంద్, అల్లరి నరేష్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ శ్వేత మోహంతి ఉన్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా వారు రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. గురు దక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.



స్వామివారి సేవలో గోపీచంద్

పేదల సంక్షేమమే జగనన్న ఆశయం

డిప్యూటీ సీఎం నారాయణస్వామి



జగనన్నే మా భవిష్యత్తుపై సూచనలు ఇస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని..వారి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. కార్వేటినగరం పంచాయతీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం "జగనన్న మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్" కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. జగనన్న పాలనలోనే పేదలకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు 7లక్షల మంది గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు 14 రోజుల పాటు ప్రతి గడపకు వెళతారని తెలిపారు. ఇచ్చిన హామీలన్నీ నేరవేర్చాం కనుకే ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లగలుగుతున్నామని చెప్పారు. టీడీపీకి ప్రజల్లోకి వెళ్లే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు మ్యానిఫెస్టోపై ప్రజలకు నమ్మకం పోయిందని, చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదని తెలిపారు. రామోజీరావు, రాధాకృష్ణ, టీవీ5 లాంటి పచ్చమీడియా ప్రభుత్వంపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలో డీఎస్సీ విడుదల చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్‌పై న్యాయం చేయడానికి కృషి చేస్తోందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో జగనన్నకు ఒంటరిగా పోటీచేసే సత్తా ఉందని, అదే చంద్ర బాబు, పవన్‌కళ్యాణ్‌కు ఒంటరిగా పోటీ చేసే దమ్ము ధైర్యం ఉందా అని సవాల్ విసిరారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు సాయికిషోర్‌రెడ్డి, ఎంపీపీ లత, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, పార్టీ మండల కన్వీనర్ శేఖర్‌రాజు, ధనంజయవర్మ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

పాలసముద్రం: ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు లాంటివని పార్టీ మండల కన్వీనర్ తులసిరామ్ యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్ అన్నారు. పాలసముద్రం బీసీ కాలనీలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లను అంటించారు. కార్యక్రమంలో సర్పంచ్ అయ్యప్ప, నాయకులు ఇందిరమ్మ, సుందరాజు, చంద్రశేఖర్‌రాజు, గోపాల్ పాల్గొన్నారు.

జీడీనెల్లూరులో..

గంగాధరనెల్లూరు: మండలంలోని బుక్కాపట్నంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఎంపీపీ అనితారెడ్డి ప్రారంభించారు. గృహసారథులు, వలంటీర్ల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ప్రతి గడపకు వెళ్లి యజమానుల అనుమతితో ఇంటి తలుపులపై స్టిక్కర్లను అంటించారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

కార్వేటినగరం: పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. కార్వేటినగరం చిన్న దళితవాడ, కుమ్మరగుంటవీధి, ఐటీఐ కాలనీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు అండగా ఉంటున్న జగనన్నకు ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలని కోరారు. ప్రతి ఇంటికీ రూ. 5 లక్షల వరకు సంక్షేమ పథకాల లబ్ధి అందుతోందన్నారు. అనంతరం పలువురు మహిళలు సమస్యలను ఆయన దృష్టి తీసుకెళ్లారు. స్పందించిన ఉప ముఖ్యమంత్రి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇంటి స్థలాలు లేని సుమారు 200 మందికి పద్మసరస్సు వద్ద ఇళ్ల స్థలాలతో పాటు, ఇంటిని నిర్మించి ఇస్తామని మంత్రి చెప్పడంతో మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. కుమ్మరగుంట వీధిలో టీడీపీకి చెందిన షబాన, కాశాతోట వీధిలో జనసేనకు చెందిన సెల్వీలకు ప్రభుత్వం రూ. 2 లక్షల వరకు సంక్షేమాలు అందిస్తున్నా కొందరిని రెచ్చగొట్టేందుకు చూస్తున్నారని చెప్పారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు భవిష్యత్తులో సీఎంలు కాలేరన్నారు. కార్యక్రమంలో సాయికిషోర్‌రెడ్డి, ఎంపీపీ లత, నాయకులు బాలాజీ, గోపి, పట్నం ప్రభాకర్‌రెడ్డి,



పాలసముద్రంలో పోస్టర్లు, స్టిక్కర్లు అందిస్తున్న నాయకులు

శేషాద్రి, శేఖర్‌రాజు, ధన్‌రాజ్, రఫీ, ధనశేఖర్‌మొదలియార్, ధనశేఖర్‌యాదవ్, హౌసింగ్ ఏఈ యోగమూర్తినాయుడు, విద్యుత్ ఏఈ రియాజ్ అహ్మద్, ఏఈ నాగభూషణం పాల్గొన్నారు.

పెత్తందారులతోనే పోరాటం

శ్రీరంగరాజపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెత్తందారులతో పోరాటం చేస్తూ..పేదల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. శుక్రవారం కొత్తపల్లిమిట్టలోని దీపిక కల్యాణ మండపంలో నియోజకవర్గంలోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల హామీల్లో 98 శాతం నెరవేర్చిన ఘనత సీఎం జగనన్నకే చెందుతుందన్నారు. సచివాల కన్వీనర్లు, గృహ సారథులు ప్రతి కుటుంబాన్ని కలిసి గత పాలన.. ఇప్పటి పాలన వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. జగనన్న అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన 30 లక్షల మంది సొంతింటి కలను నిజం చేశారని తెలిపారు. రైతుభరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్, నాడు–నేడు, ఫ్యామిలీ డాక్టర్ వంటి కార్యక్రమాలతో ప్రజలకు ఎంతో మేలు చేస్తున్న ప్రభుత్వంపై ప్రతిపక్షాలు బురద జల్లే ప్రయత్నం చేస్తోందని తెలిపారు. వారికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, గుత్తా శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



హాజరైన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు

షికారీలకు ఇంటి పట్టాల అందజేత



ఇంటి పట్టాలు అందజేస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం: పేదలకు అన్ని విధాలుగా అండగా ఉండడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. శుక్రవారం శ్రీరంగరాజపురం మండలంలోని 50 బసివిరెడ్డిపల్లె గ్రామంలో 34 మంది షికారీలకు ఇంటి పట్టాలు అందజేశారు. ప్రతి ఒక్కరి సొంతింటి కలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారని తెలిపారు. పేదల పక్షాన ఉన్న వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ లోకనాథపిళ్లై, జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ వరదమ్మ, పార్టీ మండల కన్వీనర్ మణి, నాయకులు అనంతరెడ్డి, జనార్దన్, తులసీమణి, బాబు, మహేష్, అమృతరాజ్ పాల్గొన్నారు.

మంచి అలవాట్లతో ఆరోగ్య జీవనం



నింద్ర: అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

పుత్తూరు రూరల్: ఆరోగ్యవంతమైన జీవనం కోసం ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని న్యాయవాది మురగేశన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సీ.రాఘవేంద్ర ఆదేశాల మేరకు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మితాహారం తీసుకోవడంతో పాటు ప్రతి రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. ఆకుకూరలు, పండ్లు, చిరుధాన్యాలు తీసుకోవడం ద్వారా మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చని తెలిపారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ కిరణ్మయి, హెడ్ నర్స్ దిల్షాద్ పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

నింద్ర: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య సూత్రాలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి కళ్యాణి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో వ్యాధులు దూరం

పాలసముద్రం: మంచి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని.. వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని పీహెచ్‌సీ వైద్యాధికారి మోహన్‌కృష్ణ అన్నారు. యోగా, ధ్యానంతో మానసిక ప్రశాంతత దొరుకుతుందని చెప్పారు. 45 ఏళ్ల దాటిన ప్రతి ఒక్కరూ ఆరు నెలలకు ఓ సారి విధిగా వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుశీల, మురళి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



పుత్తూరు: మాట్లాడుతున్న న్యాయవాది మురగేశన్‌రెడ్డి

న్యాయశాఖ ఉద్యోగుల ఎన్నికలు జరపకూడదు



మాట్లాడుతున్న చంద్రశేఖర్

తిరుపతి లీగల్: ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం కార్యవర్గ పదవులకు ఎన్నికలు నిర్వహించకూడదని ఉద్యోగులు తీర్మానించినట్టు రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ కోర్టు సూపరింటెండెంట్ మజ్జిగ చంద్రశేఖర్ తెలిపారు. తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డులోని రాస్ భవనంలో శుక్రవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 23న ఎన్నికలు నిర్వహించాలన్న నిర్ణయాన్ని సభ్యులు అంగీకరించలేదన్నారు. ఇటీవల కొంతమంది ఉద్యోగులు వివిధ కోర్టుల్లో చేరారని, వారికి ఉద్యోగ సంఘంలో సభ్యత్వం ఇచ్చిన తర్వాతే పదవులకు ఎన్నికలు నిర్వహించాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్టు చెప్పారు. చిత్తూరులో ఎన్నికలు నిర్వహిస్తే వాటిని అందరూ కలిసి అడ్డుకుంటామని చెప్పినట్టు వెల్లడించారు. ఈ సమావేశంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయశాఖ ఉద్యోగ సంఘం మాజీ కార్యదర్శి సుబ్రమణ్యం ఆచారి, తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి, చిత్తూరు రవి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



జీడీనెల్లూరులో శిలువ ఊరేగింపు



కార్వేటినగరం: పాస్టర్ ఉపదేశం

గంగాధరనెల్లూరు: మండలంలో గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయాన్నే చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం గ్రామ వీధుల్లో శిలువను ఊరేగించారు.

కార్వేటినగరం: మండలంలోని బీసీ కాలనీలో ఉన్న చర్చిలో పాస్టర్ ఆశీర్వాదం ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడేను జరుపుకున్నారు. అనంతరం బైబిల్‌లోని పలు అధ్యాయనాలను చదివి వినిపించారు. అలాగే కార్వేటినగరం నాలుగు రాళ్ల వద్ద ఉన్న యహోవా ఈరో చర్చిలో పాస్టర్ సరోజిని అగస్టీన్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. పాస్టర్ బాబు, సుజాత, సునిత, ఢిల్లమ్మ పాల్గొన్నారు.

పాలసముద్రం: క్రీస్తు మార్గం అనుసరనీయమని పాస్టర్ పాల్‌రాజ్ అన్నారు. శుక్రవారం వెంగళరాజు కుప్పం, వీర్లగుడి, రంగాపురం, దీనబంధుపురం, శ్రీకావేరిరాజుపురం, ఆముదాల చర్చిలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా ప్రార్థనలు చేశారు. పాస్టర్ పాల్‌రాజ్ గుడ్‌ఫ్రైడే విశిష్టతను భక్తులకు వివరించారు.

చెట్టును ఢీకొన్న కోళ్ల వ్యాన్

–నలుగురికి గాయాలు

శ్రీరంగరాజపురం: ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి కోళ్ల వ్యాను చెట్టును ఢీకొంది. ఈ ఘటన చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిలోని నెళవాయి వద్ద శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. నగరి నుంచి బెంగళూరు వెళుతున్న కోళ్ల వ్యాను నెళవాయి వద్ద ముందు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై వెళుతున్న వ్యక్తితో పాటు కోళ్ల వ్యానులోని ముగ్గురికి గాయాలయ్యాయి. అటుగా వెళుతున్న శ్రీరంగరాజపురం తహసీల్దార్ లోకనాథ పిళ్లై ప్రమాదాన్ని గుర్తించి 108 వాహనానికి సమాచారం అందించారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



ప్రమాద స్థలి వద్ద క్షతగాత్రులు

జగనన్న పాలనలోనే రాష్ట్రం సుభిక్షం

- మంత్రి ఆర్కే రోజా
- జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి శ్రీకారం



జగనన్నే మా భవిష్యత్తు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి రోజా

వడమాలపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని పర్యాటకశాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. వడమాలపేట మండలంలో "జగనన్నే మా భవిష్యత్తు" కార్యక్రమానికి శుక్రవారం శ్రీకారం చుట్టారు. ముందుగా పూడి గ్రామంలోని రేవాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ద్వారా గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు ప్రతి గడపకు వెళ్లి ప్రజల అభిప్రాయం తెలుసుకుంటారని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారా? అని తెలుసుకుని వారి మద్దతు కోరతారని తెలిపారు.

మా ధైర్యం ప్రజలే

గతంలో ఎప్పుడు లేని విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని మంత్రి తెలిపారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఎదురవుతున్నా ప్రజలకు మంచి చేయాలనే ఉద్దేశంతో ముందుకు వెళుతున్నారని చెప్పారు. ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా ప్రజలే తమ ధైర్యమని చెప్పారు. అన్ని వర్గాలకు మంచి చేస్తున్న జగనన్నకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. గత టీడీపీ పాలనలో ఒక పథకం అందాలంటే ఎన్ని ఆంక్షలు ఉండేవో అందరికి తెలిసిందేనని.. ప్రస్తుత ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు ఇంటి వద్దకే సంక్షేమ పథకం అందుతోందని తెలిపారు. అప్పటి పాలన.. ఇప్పటి పాలనను ప్రజలే బేరీజు వేసుకోవాలన్నారు. అనంతరం కొందరి ఇళ్ల వద్దకు వెళ్లి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. వారి అంగీకారంతో ఇంటికి స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రేణుక, డీసీసీబీ బ్యాంక్ డైరెక్టర్ కరుణాకర్‌చౌదరి, ఎంపీపీ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ ఉపేంద్ర, కాయం సింగిల్ విండో అధ్యక్షుడు సుధీర్ రెడ్డి, కాణిపాకం బోర్డు మెంబర్ ప్రతిమ, సర్పంచ్‌లు కుసుమరెడ్డి, ధర్మయ్య, శ్రీవిద్య, ఎంపీటీసీ రవి, నాయకులు చంద్రారెడ్డి, సురేషకుమార్, రామిరెడ్డి, యాదవేంద్రరెడ్డి, గాంధీ, మునిశేఖర్, సుబ్రమణ్యంరెడ్డి, ఉమాపతి, మునిబాబు తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు 14 వార్డులో..

పుత్తూరు రూరల్: మున్సిపల్ వైస్ చైర్మన్ డి.జయప్రకాష్ ఆధ్వర్యంలో 14వ వార్డులో "జగనన్నే మా భవిషత్తు" కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో మీరు సంతృప్తిగా ఉన్నారా అంటూ ప్రశ్నిస్తే 'మా నమ్మకం జగన్' అంటూ సమాధానం వస్తోందని ఆయ న తెలిపారు. నాయకులు జాఫర్‌బాషా, మస్తానమ్మ, నౌషద్‌బాషా, వలంటీర్లు పాల్గొన్నారు.

నగరి: మున్సిపల్ సచివాలయ కన్వీనర్ దయానిధి ఆధ్వర్యంలో గృహసారథులు, వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం ద్వారా ప్రజలకు జరుగుతున్న మంచిని వివరించారు. వారి అనుమతి మేరకు మా నమ్మకం నువ్వే జగనన్న అన్న స్టిక్కర్లను ఇంటికి అతికించారు. కరపత్రాలను అందించారు. కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు మునికృష్ణారెడ్డి, వేణి, గృహసారథులు తేన్‌మొళి, మునిరత్నం, శ్రీనివాసులు, మురళి పాల్గొన్నారు.



ఎన్జీఓ కాలనీలో స్టిక్కర్లు అందజేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్

నగరి: మున్సిపల్ సచివాలయ కన్వీనర్ దయానిధి ఆధ్వర్యంలో గృహసారథులు, వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం ద్వారా ప్రజలకు జరుగుతున్న మంచిని వివరించారు. వారి అనుమతి మేరకు మా నమ్మకం నువ్వే జగనన్న అన్న స్టిక్కర్లను ఇంటికి అతికించారు. కరపత్రాలను అందించారు. కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు మునికృష్ణారెడ్డి, వేణి, గృహసారథులు తేన్‌మొళి, మునిరత్నం, శ్రీనివాసులు, మురళి పాల్గొన్నారు.